క్లుప్తంగా

కిరణశ్రీకి ఘన నివాళి



నెల్లూరు(మినీబైపాస్): జాషువా కవితా పీఠం, గుర్రం జాషువా ప్రజా గ్రంథాలయ వ్యవస్థాపకుడు బూతపాటి కిరణశ్రీ ప్రథమ వర్ధంతిని నగరంలోని ఆయన నివాసంలో శనివారం నిర్వహించారు. కవితా పీఠ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయ ప్రధాన కార్యదర్శి శీనయ్య కార్యదర్శులు కృపాల్, శరత్‌బాబు, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): గ్యాస్ సిలిండర్ వినియోగించేటప్పుడు వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని ఎల్పీజీ హెచ్‌పీసీఎల్ డీజీఎం అశ్వనికుమార్ అగర్వాల్ అన్నారు. విడవలూరులోని ఎల్పీజీ గ్యాస్ గోదామును శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌పీ గ్యాస్ సంస్థ వారు ప్రవేశపెట్టిన గృహమిత్ర పథకం ద్వారా గ్యాస్ పైపు మార్చుకున్నా, లేదా రెండు సిలిండర్లు తీసుకున్న వారికి ఒక స్క్రాచ్ కార్డు ఇస్తారని వివరించారు. విడవలూరు హెచ్‌పీ గ్యాస్ వినియోగదారు నర్రా మంగమ్మ స్క్రాచ్ కార్డు పొందడంతోపాటు 5వ బహుమతిగా ఎయిర్ కూలర్‌ను సొంతం చేసుకుందని తెలిపారు. ముఖ్యంగా 5 సంవత్సరాలకు ఒకసారి తప్పనిసరిగా గ్యాస్‌పైపును మార్చుకోవాలని సూచించారు. అనంతరం మంగమ్మకు ఎయిర్ కూలర్‌ను అందజేశారు. కార్యక్రమంలో సేల్స్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, ఏజెన్సీ నిర్వాహకురాలు కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

బుచ్చిరెడ్డిపాళెం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఈబీ అధికారులు శనివారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ సీఐ సూర్యనారాయణ తెలిపిన వివరాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా మండలంలోని జొన్నవాడ వద్ద ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ మల్లి వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ట్యాబ్‌ల వినియోగంతో విద్యార్థులకు ప్రయోజనం



కొడవలూరు: విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను వినియోగించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఆర్జేడీ సుబ్బారావు పేర్కొన్నారు. మండలంలోని పద్మనాభసత్రం ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను ఎలా వినియోగిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులందరికీ ట్యాబ్‌లు అందజేశారు.. ట్యాబ్‌లన్నీ ఆన్‌లైన్ చేయడం ద్వారా ఏ విద్యార్థి ఎంతసేపు ట్యాబ్ వినియోగిస్తున్నారో తెలుసుకొనే వెసులుబాటు ఉన్నందున అందర్నీ ఆన్‌లైన్ చేశారా అని ఎంఈఓ వసంతకుమారిని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థుల ట్యాబ్‌ల వివరాలను ఆన్‌లైన్ చేయడం పూర్తయిందని ఎంఈఓ ఆర్జేడీకి తెలిపారు. ట్యాబ్‌ల వినియోగం వల్ల విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంపొందుతాయని, ప్రతి విద్యార్థి ట్యాబ్‌ను వినియోగించేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత హెచ్‌ఎంలదేనని తెలిపారు. ఏ విద్యార్థి అయినా ట్యాబ్‌ను వినియోగించకపోతే అందుకు హెచ్‌ఎంలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆర్జేడీ వెంట హెచ్‌ఎం మణికందరాచారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పంటల నమోదు 90 శాతం పూర్తి

పొదలకూరు: మండలంలో పంటల నమోదు కార్యక్రమాన్ని 90 శాతం పూర్తి చేశామని, మరో 2 వేల ఎకరాల్లో పంటలను నమోదు చేస్తే నూరు శాతం పూర్తవుతుందని మండల వ్యవసాయాధికారి ఎ.వాసు తెలిపారు. శనివారం ఏఓ మాట్లాడుతూ మండలంలో 14 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నట్టు తెలిపారు. 12 వేల ఎకరాల్లో రబీ సీజన్లో వరి పంట సాగవుతుండగా, 1,500 ఎకరాల్లో పత్తి, మిగిలిన 500 ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతున్నట్లు తెలిపారు. రైతులు పూర్తిగా వరి సాగుపైనే ఆధారపడకుండా ఇప్పుడిప్పుడే పంటల మార్పిడికి అలవాటు పడుతున్నట్లు తెలిపారు. ప్రతి రైతు సాగు చేస్తున్న పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకుంటే దిగుబడిని గిట్టుబాటు ధరకు విక్రయించుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

మెరుగైన విద్యుత్‌ను అందించాలి



మాట్లాడుతున్న శివప్రసాద్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వినియోగదారులకు ఎలాంటి అంతరాయాల్లేకుండా.. మెరుగైన విద్యుత్‌ను అందించేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్) శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నగరంలోని విద్యుత్ భవన్‌లో శనివారం నిర్వహించారు. అనంతరం స్కాడా కార్యాలయంలో స్కాడా పనితీరును పరిశీలించారు. బీవీనగర్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు సంభవించినప్పుడు 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్ లైన్లను నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. విద్యుత్ లైన్లలో ప్రమాదాలు జరిగితే సంబంధిత అధికారులు, సిబ్బందే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. బిల్లుల రీడింగ్‌ను కచ్చితత్వంతో తీసి వినియోగదారులకు సకాలంలో అందజేయాలని సూచించారు. అధికారులు, సిబ్బంది వారు విధులు నిర్వర్తించే హెడ్ క్వార్టర్స్‌లో నివాసం ఉండాలన్నారు. విద్యుత్ బిల్లుల బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి పారామీటర్‌ను సిస్టమ్‌లోనే పొందుపర్చేలా నూతన సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నామని వెల్లడించారు. నగరంలోని 15 సబ్‌స్టేషన్లు స్కాడా పరిధిలో ఉన్నాయని, అదే విధంగా 56 ఆర్ఎంయూలు, 45 సెక్షనైజర్స్, 15 ఆటో రిక్లోజర్స్, 50 ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్స్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ వెంకటసుబ్బయ్య, స్కాడా జీఎం శ్రీనివాసులు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసులు, నరేంద్రరెడ్డి, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న శ్రీరామ్ సతీష్



మెడికవర్ ఆస్పత్రిలో..



ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లో..

నెల్లూరు (అర్బన్): అవగాహనతో కేన్సర్‌ను నివారించుకోవచ్చని అపోలో స్పెషాల్టీ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ శ్రీరామ్ సతీష్ పేర్కొన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హరనాథపురంలోని అపోలో ఆస్పత్రిలో రోగులు, వారి బంధువులకు అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సీనియర్ ఆంకాలజీ డాక్టర్ హరిత, సర్జికల్ ఆంకాలజిస్ట్ మనోభిరామ్ మాట్లాడారు. అన్ని రకాల కేన్సర్లకు ఆధునిక వైద్యాన్ని తమ ఆస్పత్రిలో అందిస్తున్నామని వివరించారు.

కేన్సర్‌ను జయించిన వారికి సన్మానం

నగరంలోని మెడికవర్ ఇన్‌స్టిట్యూట్‌లో వైద్య చికిత్స ద్వారా కేన్సర్‌ను జయించిన వారిని సత్కరించారు. ఈ సందర్భంగా కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ సర్జికల్ ఆంకాలజీ డాక్టర్లు ముత్తు, అవినాష్ మాట్లాడారు. కేన్సర్ మేనేజ్‌మెంట్‌లో మెడికవర్ హాస్పిటల్ అగ్రగామిగా ఉందని పేర్కొన్నారు. అనంతరం అడిషనల్ ఎస్పీ హిమవతి మాట్లాడారు. ముందస్తుగా కేన్సర్ పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. డాక్టర్లు రంగరామన్, శ్రీవిద్య, ప్రియ, సాయికృష్ణ మోహన్, ఆస్పత్రి వైస్ ప్రెసిడెంట్ మహేశ్వరరెడ్డి, సెంటర్ హెడ్ గణేష్, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ సొసైటీ ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సును నిర్వహించారు. విశ్రాంత డీఎంహెచ్‌ఓ జయసింహ, స్పాస్టిక్స్ సెంటర్ ప్రిన్సిపల్ గురునాథరావు, సెక్రటరీ మస్తానయ్య, ఏఓ చంద్రశేఖర్, డాక్టర్ నవీన్, అక్తర్, ఇన్‌చార్జి ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

పొదలకూరు రోడ్డులోని ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రిలో రోగులకు పండ్లను వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవీంద్ర ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సంస్థ జిల్లా గవర్నర్, వాకర్ ఎమ్వీ రెడ్డి, నేతాజీ సుబ్బారెడ్డి, నేతలు శ్రీమన్నారాయణ, జయప్రకాష్, డిప్యూటీ గవర్నర్లు మురళీ మోహన్, నరసింహారావు, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో అవగాహన సదస్సును పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్దాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ సిద్దానాయక్, ఆంకాలజీ విభాగాధిపతి రమేష్, తదితరులను సత్కరించారు. పీఎంపీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, సత్తార్, రూడ్స్ చైర్మన్ రసూల్, పీఎంపీ జిల్లా నేతలు శేషయ్య, రామరాఘవయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నెల్లూరు(బృందావనం): సంతపేటలోని ఆరణి కందప్ప మేస్త్రి సత్ర దాత ఆరణి కందప్ప జయంతిని శనివారం నిర్వహించారు. సత్రం ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి దేవదాయ శాఖ అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. అనంతరం 75 మంది విద్యార్థులకు రూ.రెండు వేల చొప్పున అందజేశారు. 500 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానాన్ని నిర్వహించారు. సత్ర ఈఓ రాధాకృష్ణ, దేవదాయ శాఖ నెల్లూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ చైతన్య, సహాయ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల ఆత్మీయ సమావేశం



చలపతిని సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): ఏమీ ఆశించకుండా చేసేదే నిజమైన సేవ అని ఆడిటర్ చలపతి పేర్కొన్నారు. నగరంలోని పురమందిరంలో స్వచ్ఛంద సంస్థల ఆత్మీయ సమావేశాన్ని జిల్లా స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అనంతరం చలపతిని సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షుడు పాండు, రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సాంబశివారెడ్డి

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణలను యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను పొందాలని డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి కోరారు. అయ్యప్పగుడి సమీపంలోని ఐఐటీఎం స్కిల్ కాలేజీలో డీఆర్డీఏ - సీడాప్, ఏపీఎస్సెస్డీసీ, జిల్లా ఉపాధి కార్యాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణను శనివారం ఆయన పరిశీలించారు. అక్కడి సదుపాయాలు, వసతిని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. టూర్ మేనేజర్, ఫెసిలిటీ మేనేజర్, మీటింగ్ కాన్ఫరెన్స్, ఈవెంట్ ప్లానర్, తదితర రంగాల్లో ప్రస్తుతం శిక్షణ జరుగుతోందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి నూరు శాతం ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు.

9 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



మాట్లాడుతున్న యశ్వంత్‌సింగ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కబడ్డీ పోటీలను ఈ నెల 9, 10వ తేదీల్లో నిర్వహించనున్నామని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. క్రీడాకారులకు ఉచిత భోజన, వసతి సదుపాయాన్ని కల్పించనున్నామని పేర్కొన్నారు. ఓపెన్, జూనియర్స్, ఉమెన్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించి ప్రోత్సాహకంగా రూ.82 వేల నగదు బహుమతి, పతకాలను అందజేయనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 85006 50650, 97008 86797 నంబర్లను సంప్రదించాలని సూచించారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్‌రెడ్డి, కార్యదర్శి హర్ష, కార్తీక్, శివమహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వైఎంసీఏ సబ్‌స్టేషన్ పరిధిలో గల టౌన్‌హాల్ సెక్షన్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని ఏఈ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంప్లెక్స్ రోడ్డు, నాగులమిట్ట, సోమశేఖరపురం, పొగతోట, బృందావనం, సండే మార్కెట్, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- సరస్వతీనగర్ ఫీడర్‌లోని క్రాంతినగర్, సరస్వతీనగర్, మాగుంట నివాసం, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. టెక్కేమిట్ట, తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వెస్ట్ - 1 సెక్షన్ ఏఈ లక్ష్మీబాయి పేర్కొన్నారు.

దేనికైనా సిద్ధం



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: దేనికైనా తాను సిద్ధంగా ఉన్నానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలు బాధాకరమన్నారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేదిలేదని స్పష్టం చేశారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మేయర్ స్రవంతి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో పోస్టు భర్తీకి చర్యలు

నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ ఫిజికల్ సైన్స్ పోస్టును భర్తీ చేసేందుకు గానూ ఏపీ డీఎస్సీ - 2018 నోటిఫికేషన్ మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ కామేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన, డెమోను మంగళవారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నామని చెప్పారు. ఆసక్తి గల వారు ఆటోనగర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలకు రావాలని కోరారు. ఎంపికైన వారు 8 నుంచి 10వ తరగతి వరకు బోధించాల్సి ఉంటుందన్నారు.

బీజేపీ అభ్యర్థి ప్రచారం

నెల్లూరు(బారకాసు): బీజేపీ తరఫున తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బ్రహ్మానందం నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. మోడల్ స్కూల్, ఎమ్మెస్సెమ్ ఉన్నత పాఠశాల, కేఏసీ ప్రభుత్వ కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలుసుకొని మొదటి ప్రాధాన్య ఓటును తనకు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నేతలు కృష్ణ, అశోక్‌నాయుడు, శివప్రసాద్, రమణమూర్తి, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేటర్ల స్వేచ్ఛను హరించిన కోటంరెడ్డి'

నెల్లూరు(బారకాసు): నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 26 డివిజన్ల కార్పొరేటర్ల స్వేచ్ఛను హరిస్తూ తమ్ముడికి పెత్తనమిచ్చిన వ్యక్తి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రసాద్ ఆరోపించారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాల నుంచి వచ్చాం.. వారసత్వ రాజకీయాలను వ్యతిరేకిస్తున్నామంటూ మాట్లాడిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నేడు అదే వారసత్వ రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని విమర్శించారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడిగా పదవి పొందిన విషయాన్ని మర్చిపోయారానని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోసం పనిచేయకుండా తమ్ముడితో ప్రారంభోత్సవాలు, అధికారులతో సమీక్షలు చేయించి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారని ధ్వజమెత్తారు.

దళితులు, బీసీలపై ప్రేమ ఉంటే రవి, రాజేష్, మేఘనాథ్‌సింగ్‌కు కార్పొరేటర్ సీట్లను ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. ఆనం కుటుంబం నుంచి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్‌ను ఆనాడు దూరం చేసేందుకు పన్నిన కుట్ర కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అని చెప్పారు. సమావేశంలో కమల్, తదితరులు పాల్గొన్నారు.

వాణీ జయరామ్‌కు సింహపురితో అనుబంధం



కళాంజలి ఆత్మీయ పురస్కారాన్ని అందుకుంటున్న వాణీ జయరామ్ (ఫైల్)

నెల్లూరు(బృందావనం): ఎన్నో మధుర గీతాలతో తెలుగు పాటకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చి.. పురస్కారాలను అందుకున్న బహుభాషా గాయని వాణీ జయరామ్‌కు సింహపురి కళాకారులతో ఎంతో అనుబంధం ఉంది. చెన్నైలో శనివారం వాణీ జయరామ్ మరణించారనే సమాచారంతో నెల్లూరుకు చెందిన కళాకారులు ఆమెతో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

- కళాంజలి సాంస్కృతిక సంస్థ వార్షికోత్సవం సందర్భంగా 2013లో పురమందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అనంత్ ఆధ్వర్యంలో వాణీ జయరామ్‌ను ఆత్మీయ పురస్కారంతో సత్కరించారు.
- హరివిల్లు క్రియేషన్స్ అధినేత హరిబాబు తన హాస్య వల్లరి ప్రదర్శన సందర్భంగా వాణీ జయరామ్ నుంచి సత్కారాన్ని చెన్నైలో అందుకున్నారు. చెన్నై కేంద్రంగా నిర్వహిస్తున్న ఆంధ్ర సోషల్ కల్చరల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2016లో ఉగాది సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనలో ఆమె నుంచి సన్మానాన్ని పొందానని ఆయన తెలిపారు.

రత్నం సేవలు అభినందనీయం

నెల్లూరు(బృందావనం): విశాలాక్షి వృద్ధాశ్రమం ద్వారా సేవలందిస్తున్న కోసూరు రత్నాన్ని 25 కళాసంఘాల అధ్యక్షుడు, రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి అభినందించారు. కావలికి చెందిన దాతలు శ్రీనివాసులు, శ్రీధర్, రామకృష్ణ, వీర హేమంత్, తదితరుల సహకారంతో విశాలాక్షి వృద్ధాశ్రమానికి అందజేసిన జనరేటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. కళాసంఘాల కన్వీనర్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

యువకుడిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నిందితుడిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వెంగళరావునగర్‌లో సురేష్ తన అన్నా, వదినలతో కలిసి ఉంటున్నారు. నగరపాలక సంస్థలో కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్న ఈయనకు గాంధీనగర్‌కు చెందిన ఆరిఫ్ స్నేహితుడు. అప్పుడప్పుడూ సురేష్ స్నేహితుడి ఇంటికెళ్లొచ్చేవారు. ఈ క్రమంలో వీరి మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. సురేష్‌పై ఆరిఫ్ అనుమానం పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో అద్దె ఇంటి విషయమై మాట్లాడేందుకు స్నేహితుడి ఇంటికి సురేష్ శుక్రవారం వెళ్లారు. ఆ సమయంలో ఆరిఫ్ లేకపోవడంతో అతని భార్యతో మాట్లాడసాగారు. ఈ క్రమంలో ఆరిఫ్ తన స్నేహితులు యశ్వంత్, అజయ్‌కుమార్‌తో ఇంటికొచ్చి సురేష్‌తో గొడవపడ్డారు. కులం పేరుతో దూషించడంతో పాటు తమ ఇంటికి రావొద్దని చెప్పినా వస్తావా అంటూ కర్రతో తలపై బలంగా కొట్టారు. అక్కడే ఉన్న కూరగాయలు తరిగే చాకుతో పొడిచారు. చేయి అడ్డుపెట్టడంతో సురేష్‌కు తీవ్రగాయమై అపస్మారక స్థితిలో పడిపోయారు. యశ్వంత్, అజయ్ తమ స్నేహితుడ్ని అడ్డుకొని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో సురేష్‌ను చేర్పించారు. ఈ మేరకు బాధితుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్, హత్యాయత్నం కింద కేసును నమోదు చేశారు.

సెలబ్రిటీ అవ్వాలని ఇంటి నుంచి బాలుడి పరార్

నెల్లూరు(క్రైమ్): చదువంటే ఇష్టం లేదు.. యాక్టింగ్ ఇష్టం.. సెలబ్రిటీ అవ్వాలంటూ లేఖ రాసి బాలుడు ఇంటి నుంచి పరారైన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. వెంకటరెడ్డినగర్‌కు చెందిన దీప, చంద్రశేఖర్ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం, రెండో కుమారుడు గాంధీనగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. చిన్న కుమారుడు ఈ నెల రెండో తేదీన పాఠశాలకు వెళ్లలేదు. స్నేహితులను కలిసొస్తానని ఇంట్లో చెప్పి సాయంత్రం బయటకొచ్చారు. రాత్రయినా రాకపోవడంతో అతని స్నేహితుల వద్దకు వెళ్లి కుటుంబసభ్యులు విచారించగా రాలేదని చెప్పారు. దీంతో ఇంటికొచ్చి చూడగా కుమారుడు రాసిన లేఖ ఫ్రిజ్‌పై కనిపించింది. చదువంటే తనకిష్టం లేదని.. యాక్టింగ్ ఇష్టమని.. సెలబ్రిటీ అవ్వాలని ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని అందులో రాసి ఉంది. కుమారుడి అదృశ్యంపై వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరస్పర కేసులు నమోదు

నెల్లూరు(క్రైమ్): షాపు ఖాళీ చేసే విషయంలో ఇరువర్గాల ఫిర్యాదులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటకు చెందిన మునెమ్మ తన షాపును అదే ప్రాంతానికి చెందిన శ్రీనివాసులుకు 2017లో అద్దెకు ఇచ్చారు. షాపును ఖాళీ చేయాలని కొంతకాలంగా ఆమె కోరుతున్నారు. ఈ విషయమై వీరి మధ్య తీవ్రస్థాయిలో వివాదం జరిగింది. ఈ మేరకు చిన్నబజార్ పోలీసులకు వీరు ఫిర్యాదు చేశారు. కేసులు నమోదు చేశామని ఎస్సై లతీఫున్నీసా తెలిపారు.

మహిళకు వేధింపులు

నెల్లూరు(క్రైమ్): మహిళను దూషించిన ఘటనలో నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. జనార్దన్‌రెడ్డికాలనీకి చెందిన ఓ మహిళను అదే ప్రాంతానికి చెందిన మీరా కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్నారు. పలుమార్లు ఆమె వారించినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో ఆమెను మీరా అసభ్య పదజాలంతో దూషించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కమ్మల అపహరణ

నెల్లూరు(క్రైమ్): డ్రస్సింగ్ టేబుల్‌లో ఉంచిన కమ్మలు అపహరణకు గురైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లో గోవిందమ్మ తన కుమారుడితో కలిసి ఉంటున్నారు. గత నెల 15న తన ఆరు గ్రాముల బంగారు కమ్మలను డ్రస్సింగ్ టేబుల్ లాకర్‌లో పెట్టారు. అప్పటి నుంచి వాటిని పట్టించుకోలేదు. ఫంక్షన్‌కు వెళ్లేందుకు గానూ లాకర్‌ను ఇటీవల తెరిచి చూడగా కమ్మలు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళాకారులకు సన్మానం

నెల్లూరు(బృందావనం): గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా కళాకారులు, గాయకులను శనివారం సత్కరించారు. ఏవీకే ఫౌండేషన్ సౌజన్యంతో కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుబ్బారావు పర్యవేక్షణలో సుబేదారుపేటలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పద్మనాభం, రాము, రంగయ్య, తదితరులను సన్మానించారు.